ఎన్నికలప్పుడే పొత్తులపై చర్చ: తమ్మినేని

- బిజెపితో పోరాడే పార్టీలకు కమ్యూనిస్టుల మద్దతు
- 'మునుగోడు' ఫలితం కమ్యూనిస్టుల ప్రాధాన్యం చాటింది
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపిని ఓడించడమే కమ్యూనిస్టు పార్టీల ప్రధాన ఎజెండా.. దానిని బట్టే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. బిజెపితో పోరాడే పార్టీలకు కమ్యూనిస్టుల మద్దతు ఉంటుందన్నారు. బిజెపితో పోరాడినంత కాలం టిఆర్ఎస్‌కు మద్దతు ఉంటుందని చెప్పారు. ఖమ్మంలోని ఓ రెస్టారెంట్‌లో సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో తమ్మినేని మాట్లాడారు. తమ పార్టీ రాష్ట్రంలో తొమ్మిది నియోజక వర్గాలపై కేంద్రీకరించిందన్నారు. దీనిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే నాలుగు ఉన్నాయన్నారు. బిజెపి ఒత్తిడి, బెదిరింపులకు తలొగ్గే కొందరు నేతలు పార్టీలు మారుతున్నారని చెప్పారు. కేంద్ర హోంశాఖ మంత్రే ఉండి 'సీట్లు ఎన్ని వచ్చినా అధికారం మాదే' అని అమిత్‌షా ప్రకటిస్తుండటం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ఏమాత్రం నిబద్ధత లేకుండా బిజెపి వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలోనూ 20 సీట్లకుపైగా వస్తే అధికార పగ్గాలు బిజెపి చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోందని తెలిపారు. ఎన్ని సీట్లు వచ్చినా కావాల్సినంత మందిని కొనుగోలు చేసే శక్తి ఆ పార్టీ దగ్గర ఉందని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికల ఫలితం కమ్యూనిస్టుల ప్రాధాన్యత చాటిందన్నారు. రాష్ట్రంలో బిజెపికి బలం లేకున్నా.. బలమైన నేతలను ఆ పార్టీ వైపు లాక్కుని.. వారి బలాన్ని తమ బలంగా చూపుతోందన్నారు. మునుగోడులో బిజెపికి లభించిన ఓట్లకన్నా రాజగోపాల్‌రెడ్డికి వ్యక్తిగతంగా వచ్చిన ఓట్లే ఎక్కువన్నారు. కమ్యూనిస్టు పార్టీల్లో వ్యక్తిగత నిర్ణయాలుండవని, పార్టీ నిర్ణయమే శిరోధార్యం అన్నారు. తాను పాలేరు నుంచో.. ఖమ్మం ఎంపిగానో పోటీ చేస్తున్నాననేది ప్రచారం మాత్రమేనని తెలిపారు. తాను ఏమి చేయాలనేది తమ పార్టీ నిర్ణయిస్తుందన్నారు.

బిజెపి మతోన్మాదాన్ని అత్యంత వేగంగా వ్యాప్తి చేస్తోందని, దీనిని అడ్డుకునేందుకు కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యేక వ్యూహ రచనతో ముందుకెళ్తున్నాయన్నారు. లౌకికతత్వం బలంగా ఉన్న ప్రాంతాల్లోనూ మతం సెంట్‌మెంట్‌ను పులుముతోందన్నారు. ఒకప్పుడు కులమతాలకతీతంగా వేడుకలు చేసిన చోటే ఇప్పుడు బిజెపి మతం చిచ్చు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడే పొత్తులపై చర్చ అని, ఇప్పటి నుంచి అనవసరమని అన్నారు. బిజెపిపై పోరాటం విషయంలో తమ పంథా యథావిధిగా కొనసాగుతుందన్నారు.

వ్యకాస మహాసభను విజయవంతం చేయాలి

ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ఖమ్మంలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాల్సిందిగా తమ్మినేని కోరారు. 29న నిర్వహించే బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరవుతున్నట్లు తెలిపారు. సుమారు 25 వేల మందితో పెవిలియన్ గ్రౌండ్ నుంచి బహిరంగసభా స్థలి ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానం వరకు సాయంత్రం మూడు గంటలకు ప్రదర్శన ఉంటుందన్నారు. సభ ఏర్పాట్లు ఇప్పటికే ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మహాసభ, బహిరంగసభ విజయవంతానికి తోడ్పాటును అందించాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ చిట్‌చాట్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, వై విక్రమ్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘనస్వాగతం

- 30 వరకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో శీతాకాల విడిది

రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ముర్ము హైదరాబాద్ రావడం ఇదే తొలిసారి. ఐదు రోజుల పాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె విడిది చేయనున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మంత్రి సత్యవతి రాథోడ్ స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆమె వాయుసేన హెలికాప్టర్‌లో శ్రీశైలం వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో హకీంపేటలోని విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కెసిఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సిఎస్, డిజిపి, తదితర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి సైనిక గౌరవవందనం స్వీకరించారు. అక్కడే ఏర్పాటుచేసిన స్వాగత కార్యక్రమంలో రాష్ట్రపతికి మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులను సిఎం కెసిఆర్ పరిచయం చేశారు.

చేర్యాల జెడ్‌పిటిసి దారుణ హత్య

- వాకింగ్ చేస్తుండగా కత్తులు, గొడ్డళ్లతో దాడి
- పరారీలో దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా చేర్యాల జెడ్‌పిటిసి దారుణ హత్యకు గురయ్యారు. వాకింగ్ చేస్తుండగా దుండగులు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన శెట్టె మల్లేశం(43) గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున జెడ్‌పిటిసి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన సోమవారం తెల్లవారుజామున గుర్జకుంట గ్రామ శివారులోని బస్టాండ్ వైపు వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులు, గొడ్డళ్లతో మల్లేశం తలపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చి పరారయ్యారు. రక్తపు మడుగులో కుప్పకూలిన మల్లేశంను గమనించిన స్థానికులు వెంటనే సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మల్లేశం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంఘటనా స్థలాన్ని సిపి ఎన్.శ్వేత, ఎసిపి, సిఐ, ఎస్ఐ సందర్శిం చారు. ఈ మేరకు పోలీసులు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జెడ్‌పిటిసి మల్లేశంను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ చేర్యాల మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

కరోనాకు భయపడాల్సిందేమీ లేదు

- అపోలో గ్రూపు ప్రెసిడెంట్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

"చైనాలోని కరోనా పరిస్థితిపై వస్తున్న వార్తలు శాస్త్రీయ వాస్తవాలపై ఆధారపడని అనేక పుకార్లు, చర్చలకు దారితీస్తున్నాయి. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా వైరస్ ప్రభావంపై భయపడాల్సిన అవసరం లేదని మేము నమ్ముతున్నాము. దేశంలో హైబ్రిడ్ రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంది." అని అపోలో గ్రూపు హాస్పిటల్స్ ప్రెసిడెంట్స్ డాక్టర్ కె హరి ప్రసాద్ అన్నారు. కరోనా కట్టడిపై సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.. ఆ వివరాలు.. రద్దీగా ఉండే ప్రదేశాలతో ప్రత్యేకంగా మాస్క్‌లను ఉపయోగించడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ఎల్లప్పుడూ మంచిది. ఇన్‌ఫెక్షన్‌కు త్వరగా గురయ్యే ప్రమాదం కలిగిన సమూహాల కోసం, సామాజిక దూరం పాటించడం, తరచుగా చేతులు కడుక్కోవడం, శానిటైజర్లను ఉపయోగించడం. బూస్టర్ డోస్ ఇంకా తీసుకోకపోతే, అర్హత ఉన్న అన్ని వయస్సుల వారూ తీసుకోవాలి." అని సూచించారు. "జ్వరం, దగ్గు వంటి శ్వాసకోశ వ్యాధి లక్షణాల విషయంలో సాధ్యమైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి లేదా మార్గదర్శకత్వం కోసం కోవిడ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి. కోవిడ్‌కి సంబంధించి ఫలితాలు పాజిటివ్‌గా వస్తే ఎవరైనా పరీక్షలు చేయించుకుని, ఒంటరిగా ఉండాలి. భయపడాల్సిన అవసరం లేదు. జాగ్రత్తలు తీసుకోండి. సురక్షితంగా ఉండండి" అని తెలిపారు.

భూ పోరాట కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలోని మల్లు స్వరాజ్యం కాలనీలో నివాసం ఉంటున్న పేదలను ప్రజాసంఘాల ఐక్యవేదిక బృందం కలిసింది. వారితో మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. రకరకాల ఇబ్బందులు.. రకరకాల సాకులతో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కకుండా కుట్రలు చేస్తున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బృందంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, భూ సాధన సమితి సభ్యులు అర్జున్ దేవరాజ్, చంద్రకళ, లక్ష్మీ సావిత్రి ఉన్నారు.

ఎలైట్ ఉమెన్స్ నేషనల్ టైటిల్ ఛాంపియన్‌గా నిఖత్ జరీన్

మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్ రెడ్డి అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన ఆరో జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన తుదిపోరులో రైల్వేస్ (ఆర్ఎస్‌పిబి) బాక్సర్ అనామికతో తలపడి ఏకపక్ష విజయం నమోదు చేసింది. 50 కేజీల మహిళల ఫైనల్లో నిఖత్ 4-1 తో రైల్వేస్ బాక్సర్ అనామికపై గెలుపొందింది. పోరు ఆరంభం నుంచే వరుస పంచ్‌లతో విరుచుకుపడిన నిఖత్‌కు, అనామిక కనీస పోటీనివ్వలేకపోయింది. ఆమె కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. నిజామాబాద్ గడ్డ కీర్తి ప్రతిష్టలు, తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని చిరస్థాయిలో నిలిచిపోయేలా తన ప్రతిభను కనబరుస్తున్న నిఖత్ జరీన్‌కు మంత్రి వేముల అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు.

క్లాట్‌లో అనకాడమీ విద్యార్థుల ప్రగతి

ప్రజాశక్తి-హైదరాబాద్

ఎడ్‌టెక్ సంస్థ అనకాడమీ విద్యార్థులు క్లాట్-2022 పరీక్షల్లో మెరుగైన ప్రగతిని కనబర్చారని ఆ సంస్థ తెలిపింది. తమ విద్యార్థి ఒక్కరు ఏకంగా 99.99 శాతం స్కోర్‌ను సాధించారని.. 50 మంది విద్యార్థులు 99 శాతం స్కోర్‌ను నమోద చేశారని పేర్కొంది. 74 మంది 98 శాతం స్కోర్‌ను పొందారని తెలిపింది. చిన్న నగరాలు, పట్టణాల వ్యాప్తంగా ఆన్‌లైన్ చదువును మరింత ఎక్కువ అందుబాటులోనికి తీసుకురావడానికి తమ వేదిక దోహదం చేస్తోందని ఆ సంస్థ తెలిపింది.

మహారాజ శ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 51/21.

1.నాగరాజు నవీన్ మరి యొకరు ...వాదులు.
మరియు
1.బేతంచెర్ల అప్పయ్య మరి 16 మంది .
...ప్రతివాదులు.

D15-నాగండ్ల విజయలక్ష్మి, భర్త రాజేంద్రకుమార్, ఇనెం :3-11-116/15/3, శ్రీ సాయి గార్డెన్, రామాంతపూర్, ఉప్పల్, అంబర్ పేట, హైదరాబాద్ -500013.

పైన తెలిపిన 15 వ ప్రతివాది ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొననందును, శ్రీ కోర్టువారి వుత్తర్వుల ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియచేయటమైనది. వాయిదా 23-1-2023, ది 21-3-2023 వ తెది. ఉ. 10.30 గంటలకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయము గా గాని లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హజరయి మీ యొక్క ఆక్షేపణలను తెలియచేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానింపబడునని తెలియచేయటమైనది.
వాయిదా: 23.1-2023.

ఇట్లు
ముత్తవరపు శ్రీనివాసరావు
అడ్వకేట్
నరసరావుపేట.

గచ్చిబౌలి వద్ద టిప్పర్ బీభత్సం

- ఆగి ఉన్న కార్లు, బైక్‌లపైకి దూసుకెళ్లిన వైనం
- ఫుడ్ డెలివరీ బాయ్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి గచ్చిబౌలి విప్రో జంక్షన్ వద్ద టిప్పర్ బీభత్సం సృష్టించింది. ఆగి ఉన్న వాహనాలపైకి టిప్పర్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఫుడ్ డెలివరీ బాయ్ మృతిచెందాడు. పలువురికి గాయాలయ్యాయి. సిఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి 12 గంటల సమయంలో హైదరాబాద్ ఐటి నుంచి కాంటినెంటల్ ఆస్పత్రికి పోయే దారిలో విప్రో జంక్షన్ వద్ద రెడ్ సిగ్నల్ పడింది. నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు కార్లు ఆగాయి. వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం వాటిపైకి దూసుకెళ్లింది. టిప్పర్ వేగానికి రెండు ద్విచక్ర వాహనా లు, నాలుగు కార్లు ధ్వంసం అయ్యాయి. ఈ ఘటనలో స్విగ్గిలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న నాసిర్ హుస్సేన్(26) మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయా లు, ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్ హరి అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలి

డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పోలీసు నియామకాల్లో భాగంగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం లాంగ్‌జంప్ దూరాన్ని 3.8 మీటర్ల నుంచి నాలుగు మీటర్లకు పెంచడంతో అనేక మంది అభ్యర్థులు నష్టపోతున్నారని విమర్శించారు. అదేవిధంగా ఎత్తు కొలతలను డిజిటల్ పద్ధతి ద్వారా కొలవడంతో సాంకేతిక లోపం వల్ల చాలా మంది అభ్యర్థులు అర్హత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరుగులో అర్హత సాధించిన అభ్యర్థులకు సివిల్, కమ్యూనికేషన్, ఫైర్, జైల్, ఎక్సైజ్ విభాగాల్లో మెయిన్స్‌కి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లాంగ్‌జంప్‌లో ఆన్ ద లైన్ జంప్‌ని అనుమతించాలని కోరారు. డిజిటల్ విధానాన్ని తీసేసి, పాత పద్ధతిలోనే మ్యానువల్‌గా అభ్యర్థుల ఎత్తు కొలతలను తీసుకోవాలని సూచించారు. హైకోర్టు తీర్పు ప్రకారం ప్రిలిమ్స్‌లో ఏడు మార్కులు కలిపి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్‌డి జావెద్, అభ్యర్థులు జ్యోతి, విజయలక్ష్మి, మహేష్, నరేష్, సాయి, ఈశ్వర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేయులో 6% మంది ఉద్యోగులకు కోత

న్యూఢిల్లీ : చెల్లింపుల సేవల సంస్థ పేయులో 150 మంది లేదా 6 శాతం మంది ఉద్యోగులను తొలగించారని సమాచారం. నెథర్లాండ్ కేంద్రంగా పని చేస్తున్న ఈ కంపెనీ భారత్‌లోని తన అన్ని బృందాల్లోని ఉద్యోగులకు ఉద్వాసన పలికిందని ఇటి ఓ రిపోర్టులో తెలిపింది. భారత్‌లో అగ్రగామి ఆన్‌లైన్ పేమెంట్ సొల్యూషన్స్‌లో పేయు ఒక్కటి. ఇది దాదాపుగా 4.5 లక్షల వ్యాపార సంస్థలకు చెల్లింపుల గేట్‌వేను కల్పిస్తుంది.

టాటా ప్లే బింగేలో లయన్స్‌గేట్ ప్లే

న్యూఢిల్లీ : అనేక ఒటిటిలను ఒకే వేదికపై తెస్తున్న టాటా ప్లే బింగేలో కొత్తగా లయన్స్‌గేట్ ప్లేను అందుబాటు లోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఇది బింగే కుటుంబంలో చేరిన 19వ యాప్‌గా ఉందని పేర్కొంది. లయన్స్‌గేట్ ప్లే స్ట్రీమింగ్‌లో విస్తృత డిజిటల్ ప్రీమియర్లు, అన్ని భాషల్లో సమకాలీన కంటెంట్‌ను, బిలియన్-డాలర్ ఫ్రాంఛైజీ చలన చిత్రాలు, టివి షోలు, వెబ్ సిరీస్‌లు, ప్రీమియం ఒరిజినల్స్ ఇందులో అందుబాటులో ఉంటాయని పేర్కొంది. వీక్షకులు ఇప్పుడు లయ న్స్‌గేట్ ప్లే సహా ఇతర 18 యాప్‌లను నెలకు రూ.299 చెల్లిస్తే చాలని టాటా ప్లే తెలిపింది.

ఐడిబిఐ బ్యాంక్‌లో ఎఫ్‌డిపై 7.60% వడ్డీ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయ వడ్డీ రేటును ప్రకటించింది. 700 రోజుల కాల పరిమితి కలిగిన ఎఫ్‌డిలపై 7.60 శాతం వడ్డీని అందిస్తున్నట్లు తెలిపింది. రిటైల్ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ అధిక వడ్డీ రేటు ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఎఫ్‌డిలపై ఆ బ్యాంక్ అందిస్తున్న వడ్డీ రేట్లలో ఇదే గరిష్టం. ఈప్లాన్ డిసెంబర్ 26 నుంచి అందుబాటులో ఉంటుందని ఐడిబిఐ బ్యాంక్ తెలిపింది.

2023లో ఆర్థిక మాంద్యమే..!

- సిఇబిఆర్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది 2023లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం చోటు చేసుకోనుందని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ (సిఇబిఆర్) తెలిపింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న అధిక ద్రవ్యోల్బణం సంక్షోభానికి ఆజ్యం పోస్తుందని పేర్కొంది.

మరోవైపు ద్రవ్యోల్బణ కట్టడికి వరుసగా పెంచుతున్న వడ్డీ రేట్లు రుణాలను మరింత భారం చేస్తున్నాయని తెలిపింది. దీంతో అనేక దేశాల వృద్ధి మందగిస్తుందని విశ్లేషించింది. 2022లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 100 ట్రిలియన్ డాలర్లు చేరినప్పటికీ.. ధరల కట్టడి కోసం చేపడుతున్న చర్యలు వృద్ధికి విఘాతంలా మారాయని తెలిపింది. 2023లోనూ రేట్ల పెంపు కొనసాగుతుందని అంచనా వేసింది. ఇది వచ్చే కొన్నేళ్ల పాటు వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావాన్ని చూపించనుందని తెలిపింది.

పోలీస్ ఉద్యోగాల ఎంపికలో గందరగోళం

ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులను తొలగించే కుట్ర • బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల ఎంపికలో గందరగోళం సృష్టిస్తూ ఎస్సి,ఎస్టి,బిసి అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక కాకుండా కుట్రలు చేస్తున్నారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో నిరుద్యోగ అభ్యర్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల ఈవెంట్స్‌లో 3.8 మీటర్లు ఉన్న లాంగ్ జంప్‌ను దేశంలో ఎక్కడా లేనివిధంగా నాలుగు మీటర్లకు పెంచారని తెలిపారు. దాంతో అందులో 50 శాతం మందైనా క్వాలిఫై అవ్వడం లేదన్నారు. గత నోటిఫికేషన్ ప్రకారం.. ఐదు రకాల ఈవెంట్స్‌లో మూడు ఈవెంట్స్‌లో క్వాలిఫై అయితే సివిల్స్, కమ్యూనికేషన్స్, ఎక్సైజ్, ఫైర్, జైల్ వార్డులాంటి వివిధ రకాల పోస్టులకు మెయిన్ ఎగ్జామ్ రాయటానికి అవకాశం కల్పించే వారని తెలిపారు. దానికి భిన్నంగా ప్రస్తుత నోటిఫికేషన్‌లో మూడు ఈవెంట్స్ మాత్రమే పెట్టారన్నారు. ఇందులో మొత్తం క్వాలిఫై అయితేనే మెయిన్స్ రాయడానికి అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. దాంతో చాలామంది అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన సెలక్షన్ విధానాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లాంగ్ జంప్‌ను 3.8 మీటర్లకు తగ్గించాలని.. 1600/800 మీటర్ల రన్నింగ్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు మెయిన్ ఎగ్జామ్ రాయడానికి అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏడు మల్టిపుల్ ప్రశ్నలకు ఏడు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, పగిళ్ల సతీష్, పగడాల సుధాకర్, రాజ్ కుమార్, నరసింహ, కృష్ణ యాదవ్, దీపిక, బిల్లా, నిఖిల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

భారీ ప్రదర్శనలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

దేశ్‌ముఖ్‌లో ఎన్‌పిఆర్‌డి జాతీయ మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్‌పిఆర్‌డి జాతీయ మహాసభ 27, 28 తేదీల్లో యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలో జరగనుంది. జాతీయ మూడో మహాసభకు ఆహ్వాన సంఘం భారీ ఏర్పాట్లు చేసింది. సెయింట్‌మేరీ ఇంజినీరింగ్ కాలేజీలో జరగనున్న మహాసభకు 12 రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. 27 న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సెమినార్‌కు రాష్ట్ర ఎస్‌సి, మైనారిటీ, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, కేరళ ఉన్నత విద్య సోషల్ జస్టిస్ మంత్రి ఆర్ బిందు, తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, ఎన్‌పిఆర్‌డి జాతీయ అధ్యక్షులు క్రాంతి గంగూలీ, ప్రధాన కార్యదర్శి మురళీధరన్ హాజరుకానున్నట్టు ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి అడివయ్య తెలిపారు. వికలాంగులు అధిక సంఖ్యలో విచ్చేసి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జెండా ఆవిష్కరణ

దేశ్‌ముఖ్ గ్రామంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ సోమవారం జెండాను ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభకు జిల్లా నేతలు, వికలాంగులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రవణ్ కట్కూరు ఆదర్శ్ రాసాల కిష్టయ్య బైకాని లక్ష్మమ్మ మేకల అచ్చయ్య ,కర్రోల అంజయ్య, తోటకూరి వెంకటేశం, కన్నబోయిన తదితరులు పాల్గొన్నారు.

'వల్లభాయ్' కుస్తీ పోటీల విజేత అమర్‌నాథ్

ప్రజాశక్తి-హైదరాబాద్

నగరంలోని అత్తాపూర్‌లో జరిగిన సర్దార్ వల్లబాయ్ పటేల్ కుస్తీ పోటీల్లో నాలుగవ టైటిల్ కేసరి విజేతగా గాండ్ల అమర్‌నాథ్ నిలిచారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుండి పాల్గొన్న మల్లయోదుల కుస్తీలో నెగ్గారు. గంగపుత్ర సంఘం వ్యాయామశాలకు చెందిన అమర్‌నాథ్ 75 - 90 కిలోల విభాగంలో ఈ టైటిల్‌ను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం సబ్జిమండి అధ్యక్షులు గుడమని అశోక్ కుమార్, సభ్యులు శివరత్నం, బాల నర్సింహా, కట్టా లింగం, జగన్, శ్రీనివాస్ అమర్‌నాథ్‌ను ఘనంగా సత్కరించారు.

IN THE COURT OF THE XI ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
O.S.No.312 of 2015

Between:
M/s Vijaya Durga Estates and Co. (since dissolved) & Others.
....Plaintiffs
AND
Sri Kambalaparlly Karunakar Reddy & Others.
... Defendants

1. Ms.B.Deepthi, W/o B.Suman Reddy, H.No.17-1-382/K/B/1, Balaji Nagar, Champapet, Hyderabad-500059 **D-10**
2. G.Yadaiah Chinna, S/o.G.Venkaiah, Flat No. 301, H.No.1-9-30, Lakshmi Residency, Road NO.3, Vidyuth Nagar, Dilsukhnagar,Hyderabad 500060 **D-15**
3. G.Pedda Yadaiah, S/o G.Chinna Venkaiah, H.No.16-11-741/C/5/A, Subha Nilayam, Dilsukhanagar, Hyderabad-500036 **D-18**
4. K.Ashok Reddy, S/o K.Linga Reddy, H.No.8-2-683/B/1, RajaRajeswariNilayam, Road No.12, Banjara Hills, Hyderabad. **D-19**
5. M.SanjeevaReddy,S/o. M.Narasimha Reddy, Flat No.502, Balaji Towers, RTC Officer Colony, Champapet, Hyd. **D-22**
6. Anurudh Reddy, S/o.M.Jaipal Reddy, Flat No.G-1, Amrutha Palace, Street No.14, Lane No.3, Tarnaka, Secunderabad **D-24**
7. K.Akanksha, D/o.K.Srinivas Reddy, H.No.17-1-382/K/B/11, Champapet, Hyderabad 500059 **D-26**
8. K.Ravi, C/o.K.Karunakar Reddy, Plot No.19,H.No.17-1-382/N.19, Nagarjuna Colony, Champapet, Hyderabad-500059 **D-27**

...Defendants

Take Notice that the plaintiff filed the above suit O.S.No.312 of 2015 for dissolution of partnership firm and rendition of accounts and recovery of amount. In the said suit you are made as defendants and the said suit stands posted to 06-01-2023 for your appearance before this Hon'ble XI Additional Chief Judge, City Civil Court, Hyderabad at 10:30 AM by person or through your counsel failing which the matter will be decided as per law.

(BY ORDER OF THIS HON'BLE COURT)

M.V.DURGA PRASAD
M.SHYAMSUNDAR REDDY &
M.NITESH SINGH
P.PREETHI GOUD
ADVOCATES,
Plot no.332-B, Road No.82,
Adj.Ramanaidu Studios,
Jubilee Hills, Hyderabad-96.

బిసిల రిజర్వేషన్లు పెంచాలి

సిఎంకు ప్రవీణ్‌కుమార్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిసిల కులగణన చేపట్టి.. పెరిగిన జనాభాకనుగుణంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ రిజర్వేషన్లు పెంచాలని బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు ఆయన సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'రాష్ట్రంలో బిసి వర్గాల జనాభా 50 శాతానికి పైగా, మొత్తం జనాభాలో సగం ఉంది. కానీ రాష్ట్రం లోని విద్య, ఉద్యోగ, ఇతర అన్ని రంగాల్లో బిసిల వాటా కేవలం 27 శాతం మాత్రమే ఉంది. గత 75 ఏళ్లుగా వారికి తమ వాటా అందక వెనక్కి నెట్టేయబడ్డారు. కేంద్ర ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు ఎలాంటి పరిశోధనాత్మక విచారణ లేకుండానే కేవలం ఎనిమిది శాతం ఉన్న రిజర్వేషన్లను పది శాతానికి పెంచేందుకు చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టాన్ని యధావిధిగా రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వం.. 52 శాతం జనాభా ఉన్న బిసిలకు రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేద'ని ప్రశ్నించారు.

సిబిఐకి అప్పగించడం ఎంతవరకు సబబు..?

ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించడం ఎంతవరకు సబబు అని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రశ్నించారు. తనను విచారించినప్పుడు ఇడి అధికారులకు ఏమీ దొరకలేదని, అందుకే సిబిఐని రంగంలోకి దించారని ఆరోపించారు. హైకోర్టు తీర్పు కాపీ ఇంకా రాలేదని.. ఆ కాపీ చూసిన తర్వాత ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సిట్ లేదా సిబిఐతో విచారణ చేయించాలని తొలుత నిందితులే కోరారని, సిట్‌లో సీనియర్ పోలీసు అధికారులను నియమించారని తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.."రాష్ట్రంలో, దేశంలో ఏం జరుగుతుందో ప్రజలంతా గమనించాలి. కావాలనే అధికారులతో వేధించారు. ఇడి, సిబిఐ ఏది వచ్చినా మేం సిద్ధంగానే ఉన్నాం. తప్పు చేయనప్పుడు మాకు భయం అవసరం లేదు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసముంది. చివరకు న్యాయమే గెలుస్తుంది. ఇడి విచారణపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాం. కోర్టు తీర్పు వచ్చిన తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం" అని రోహిత్‌రెడ్డి అన్నారు.

చంద్రబాబుకు అవకాశం ఇచ్చిందే కెసిఆరే : జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

పార్టీ పేరు మార్పు చేసి సిఎం కెసిఆర్ తెలంగాణ ప్రజలను అవమానించారని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. కెసిఆర్ ఏపీకి వెళ్తున్నారు కాబట్టే చంద్రబాబు తెలంగాణకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సైలెంట్‌గా ఉన్న చంద్రబాబును రాష్ట్రానికి వచ్చేలా కెసిఆర్ అవకాశం ఇచ్చారన్నారు. ఏపీ రాజకీయాల్లో కెసిఆర్ ప్రభావం చూపించలేరు కానీ, తెలంగాణలో చంద్రబాబు ప్రభావం చూపించగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు.

"పార్టీ పేరు నుంచి తెలంగాణను తీసేయడంతో తెలంగాణ వాదాన్ని చంపేయడమే కాకుండా తన బలాన్ని కేసీఆర్ కోల్పోయారు. సీఎం కేసీఆర్ మనసులో ఎక్కడో ఇంకా సమైక్య భావన ఉంది. రాజకీయ బతుకునిచ్చిన చెట్టునే ఆయన నరికేశారు. ఇకపై రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా ఉంటాయి. మహారాష్ట్ర, కర్ణాటకకు బీఆర్‌ఎస్ వెళ్తే.. తెదేపా కూడా వెళ్తుంది." అని అన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు

- ఇళ్ల స్థలాల పోరాటాలు ఉధృతం చేస్తాం
- పేదలకు ఎర్రజెండా అండగా ఉంటుంది
- నెల్లుట్లలో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాడుతాం
- ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య

గుడెసెలను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుపేదల గూడు కోసం ఇళ్ల స్థలాల పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య అన్నారు. కొద్ది రోజుల కిందట జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం నెల్లుట్ల గ్రామ శివారులో వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర బృందం సోమవారం పరిశీలించింది. ఆయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, సిఐటియు నాయకులు జయలక్ష్మి, మాధవి ఉన్నారు.

గుడిసెలు వేసుకున్న నిరుపేదలతో నాయకులు మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వారికి ఎర్రజెండా అండగా ఉంటుందని ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం అధ్యక్షత నిర్వహించిన సభలో వీరయ్య మాట్లాడారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు ఎంతోమంది అవస్థలు పడుతున్నారన్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 44 పోరాట కేంద్రాల్లో 18 వేల మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని పోరాటం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాల భూపోరాటాలు ఇంతటితో ఆగేవి కావన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లస్థలాలు దక్కేవరకు పోరాడతామని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఇళ్లస్థలాలు సాధించుకునే వరకు పేదలు ఇక్కడే ఉంటారన్నారు. భూ కబ్జాదారులైనా, ప్రభుత్వమైనా పేదల గూడుకు అడ్డం వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా పేదలకు కనీసం నిలువ నీడను కల్పించలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన కొన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నేటికీ ఇవ్వలేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం నిరుపేదలు గుడిసెలు వేసి పోరాటాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వం పోలీసులతో బెదిరింపులకు దిగుతుందన్నారు. ఖబర్దార్.. పోలీసుల బెదిరింపులకు పేదల పోరాటాలు ఆగిపోవని హెచ్చరించారు. పేదలకు ఇళ్లు నిర్మించలేని ప్రభుత్వాలకు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తే అడ్డుకునే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే అప్పగించాలని, అసంపూర్తిగా ఉన్న ఇళ్లను తక్షణమే నిర్మించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు ఇండ్లస్థలాలు చూపించి వారు నిర్మించుకునేందుకు రూ.ఐదు లక్షలు అందజేసి ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఎర్రజెండా నీడలో గూడు లేని నిరుపేదలందరినీ ఐక్యం చేసి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించి ఇళ్లస్థలాలు సాధించేవరకు పోరాటాలు నిర్వహి స్తామని చెప్పారు. ప్రజాసంఘాల నాయకులు పల్లెర్ల లలిత, దేవదానం, శంకరయ్య, చిరంజీవి, రమేష్, రాజేశ్వరి, నాగరాజు, రజిని తదితరులు పాల్గొన్నారు.

భూ పోరాట కేంద్రం సందర్శన

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలోని మల్లు స్వరాజ్యం కాలనీలో నివాసం ఉంటున్న పేదలను ప్రజాసంఘాల ఐక్యవేదిక బృందం కలిసింది. వారితో మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. రకరకాల ఇబ్బందులు.. రకరకాల సాకులతో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కకుండా కుట్రలు చేస్తున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బృందంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, భూ సాధన సమితి సభ్యులు అర్జున్ దేవరాజ్, చంద్రకళ, లక్ష్మీ సావిత్రి ఉన్నారు.

సెస్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ హవా

15 డైరెక్టర్ స్థానాల్లో 14 కైవసం చేసుకున్న అధికారపార్టీ అభ్యర్థులు

వేములవాడ రూరల్ స్థానానికి కొనసాగుతున్న రీ కౌంటింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్నసిరిసిల్ల జిల్లా సహకార విద్యుత్ సంస్థ (సెస్) డైరెక్టర్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్ హవా కొనసాగింది. మొత్తం 15 డైరెక్టర్ స్థానాల్లో 14 కైవసం చేసుకోగా.. మరో స్థానానికి రీ కౌంటింగ్ చేపట్టడంతో ఫలితాల లెక్కింపు అర్ధరాత్రి వరకూ కొనసాగింది. పార్టీ గుర్తుతో ఎన్నికలు జరగకపోయినా ఆయా రాజకీయ పార్టీలు బలపరిచిన అభ్యర్థులు హోరాహోరీగా తలపడ్డారు. పేరుకు జిల్లాకే సెస్ పరిమితమైనా.. ఓటర్లు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉండటం, అన్ని డైరెక్టర్ స్థానాల్లో బిఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులకే ఓట్లు రావడం అధికారపార్టీకి శుభసూచకంగా చెప్పవచ్చు.

మొత్తం 13 మండలాల పరిధిలో 15 డైరెక్టర్ స్థానాలు ఉండగా.. సెస్ పరిధిలో 87,130 ఓట్లు ఉన్నాయి. జిల్లా పరిధిలోని ఇల్లంతకుంట మానకొండూర్ నియోజకవర్గంలో, బోయిన్‌పల్లి మండలం చొప్పదండి మండలంలో, కోనరావుపేట, రుద్రంగి, చందుర్తి మండలాలు వేములవాడ నియోజకర్గంలో ఉండటం, మిగిలిన మండలాలు సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో ఉండటం గమనార్హం. అధికారపార్టీకి తామే ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటున్న బిజెపి.. తాను బలపరిచిన అభ్యర్థులకు చాలా చోట్ల డిపాజిట్లు దక్కలేదు. అయితే ఒకటి రెండు చోట్ల మాత్రం గట్టిపోటీనే ఇచ్చారు. చందుర్తి డైరెక్టర్ స్థానానికి సంబంధించి రెండు ఓట్ల తేడాతోనే బిఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి పొన్నాల శ్రీనివాసరావు గెలుపొందారు. 15 డైరెక్టర్ స్థానాల్లో ఒక దానికి రీకౌంటింగ్ సాగుతున్నప్పటికీ.. మిగిలిన స్థానాలన్నీ క్లీన్‌స్వీప్ చేయడం బిఆర్‌ఎస్‌కు శుభసూచకంగా ఉందంటూ ఆ పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

వేములవాడ రూరల్ స్థానంపై వీడని చిక్కుముడి

వేములవాడ టౌన్-1 నుంచి పోటీ చేసిన బిఆర్‌ఎస్ అభ్యర్థి ప్రత్యర్థిపై 700 ఓట్ల తేడాతో గెలుపుపొందారు. వేములవాడ టౌన్-2 లోనూ అధికారపార్టీ అభ్యర్థి రేగులపాటి చరణ్‌రావు విజయం సాధించారు. అయితే, వేములవాడ సెగ్మెంట్‌లో రూరల్ స్థానం మాత్రం కీలకంగా మారింది. ఇక్కడ ఓట్ల లెక్కింపు సరిగా లేదని, తమ గెలుపు ఖాయమని తొలుత అధికారులు చెప్పి ఇప్పుడు మాట మార్చడమేంటని బిజెపి బలపరిచిన అభ్యర్థి అభ్యంతరం వ్యక్తం చేశారు. రీకౌంటింగ్ చేయాలని దరఖాస్తు చేయడంతో ఈ స్థానానికి పడిన ఓట్లను రాత్రి ఏడు గంటల తరువాత మళ్లీ లెక్కింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుండటంతో ఒక్క స్థానమైనా దక్కించుకోకపోతామా? అన్న ఆశతో బిజెపి శ్రేణులు ఎదురుచూస్తున్నాయి.

పలుచోట్ల ఆందోళనలు

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట డైరెక్టర్ స్థానం ఫలితాల పట్ల బిఆర్‌ఎస్, బిజెపి ఆందోళనకు దిగాయి. కొత్తపల్లి గ్రామ బ్యాలెట్ పెట్టెలకు సీల్ లేకపోవడంపై స్వతంత్ర అభ్యర్థి, బిజెపి ఏజెంట్లు అభ్యంతరం చేశారు. ధర్నాకు దిగిన స్వతంత్ర అభ్యర్థిని, ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు.వేములవాడ రూరల్ స్థానంలో బిజెపి అభ్యర్థి జక్కుల తిరుపతి గెలుపొందినట్టు ప్రచారం అందుకుంది. ఇదే క్రమంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆకుల దేవరాజ్ విజయం సాధించినట్టు ప్రచారం జరగడంతో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య పరస్పర వాదోపవాదాలు జరిగాయి.

కదిలిన నాగోబా జాతర ప్రచార రథం

ఐదు గ్రామాల్లో బస చేస్తూ పయనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూరాడి వద్ద సంప్రదాయ పూజలు నిర్వహించి సోమవారం నాగోబా జాతర ప్రచార రథాన్ని ప్రారంభిం చారు. ఆదిలాబాద్ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కేస్లాపూర్‌లోని నాగోబా జాతర వచ్చేనెల జనవరి 21 నుంచి 28 వరకు అధికారికంగా జరుగనుంది. సోమవారం నాగోబా పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మెస్రం వంశీయులతోపాటు చిన్ను పటేల్, ఖటోడ కోసే రావ్, హన్మంతు, ప్రధాన్ గణపతి, తిరుపతి ఒక చోట గుమిగూడారు. ఐదు రోజులు ఎక్కడెక్కడ బసచేయాలో తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వారి సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం మెస్రం అల్లుండ్లచే ప్రచార రథాన్ని ఊరి పొలిమేర వరకు సాగనంపారు. అక్కడ అల్లుని చేత ప్రచారానికి బయలుదేరే ప్రధాన్ మెస్రం గణపతి, ఖటోడ (పూజారి)కు వారి ఆచారం ప్రకారం తమల పాకును వేసి పాదాభివందనం చేశారు. అనంతరం ప్రచార రథాన్ని సాగనంపారు. ఈ రథం సిరికొండకు వెళ్లి అక్కడ తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం కుమ్మరి గుగ్గిల్ల స్వామికు పూజలకు ఉపయోగించే కొత్త కుండల కోసం బయాన ఇస్తారు. అదే రోజున రాత్రి సిరికొండ మండలం రాజంపేటలో బసచేస్తారు. అక్కడి నుంచి మంగళవారం గుడిహత్నూర్ మండలంలోని సోయం గూడలో, 28న బుధవారం గిన్నేర (ఇంద్రవెల్లి) మండలం, 29న గురువారం సాలేవాడ (ఉట్నూర్) మండలం, 30న శుక్రవారం వడగావ్ (ఇంద్రవెల్లి) తదితర మండలాల్లో బసచేస్తూ 31న శనివారం రోజున కేస్లాపూర్ సన్నిధిలోని పేర్సారోన్ (పెద్ద ఇల్లు) మడావి ఇంటివద్ద బస చేస్తారు. జనవరి 1న ఆదివారం పూజలు చేసిన అనంతరం పవిత్ర గంగాజలం కోసం బయలు దేరుతారు.

కోవిడ్ నియంత్రణలో చైనాపై దుష్ప్రచారం

ఎస్‌వికె వెబినార్‌లో ఐటీ ప్రొఫెషనల్ కిరణ్‌చంద్ర

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మరోసారి చైనాలో కోవిడ్ వ్యాప్తి జరిగి, ప్రజలు పెద్దఎత్తున చనిపోతున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఐటీ ప్రొఫెషనల్ వై కిరణ్‌చంద్ర చెప్పారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో 'చైనాలో ఏం జరుగుతుంది?' అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కిరణ్‌చంద్ర మాట్లాడుతూ... కోవిడ్‌కు ముందు, ఆ తర్వాత తాను ఆదేశంలో పర్యటించి వచ్చాననీ, భారతదేశంతో పోలిస్తే, అక్కడి వైద్యసేవలు అత్యంత మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ఒమైక్రాన్ వైరస్ రూపాంతరం చెంది చైనాలో వ్యాప్తి చెందిందనీ, భారతదేశంలో ఈ వైరస్ గతంలో ప్రతి ఇంటినీ తట్టిందని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన డెల్టా వేరియంట్‌తో పోలిస్తే, ఒమైక్రాన్ వ్యాప్తి, మరణాల సంఖ్య తక్కువని అన్నారు. చైనాలో డైనమిక్ జీరో కోవిడ్ పాలసీని ఎత్తివేశాక, ఒమైక్రాన్ వేరియంట్ వ్యాప్తిని ఆ దేశ శాస్త్రవేత్తలు ముందే అంచనా వేశారనీ, అయితే ప్రాణహాని లేనందున డైనమిక్ జీరో పాలసీని తెచ్చి, దానిలో ప్రజలు, ఆరోగ్యకార్యకర్తలు సహా అందర్నీ భాగస్వాములను చేశారని వివరించారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి ప్రజలు స్వచ్ఛందంగా టెస్టులు చేయించుకుంటున్నారనీ, ఆ దేశంలో కోవిడ్ నిర్వహణ పూర్తి పారదర్శకంగా ఉందని చెప్పారు. ఒమైక్రాన్ వేరియంట్‌తో చైనాలో పెద్దఎత్తున ప్రజలు చనిపోతున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తొలి కథనం రాసిందనీ, ఆ వార్తకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ఆ తర్వాత దాన్ని ఆధారం చేసుకొని, వివిధ దేశాల్లో చైనాపై దుష్ప్రచారం ప్రారంభించారని చెప్పారు. చైనాలో వలంటీర్లు వ్యాక్సినేషన్‌ను ఇంటింటికీ తిరిగి ఇచ్చారని చెప్పారు. చైనాలో బేసిక్ మందులు కూడా అక్కడ దొరకట్లేదనే ప్రచారం హాస్యాస్పదమన్నారు. ఫ్లూ జ్వరం మందులపై కొన్ని అంక్షలు విధించారని తెలిపారు. భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వాడుతున్న డోలో 650 టాబ్లెట్లను ప్రపంచం మొత్తానికి సరఫరా చేస్తున్నది చైనానే అనీ, అలాంటి చోట మందులు లేవంటూ మీడియా అసత్య ప్రచారానికి పాల్పడుతున్నదని విమర్శించారు. చైనాపై మీడియాలో వస్తున్నవన్నీ తప్పుడు వార్తలేననీ, పనీపాటాలేని మీడియా సంస్థలు వీటిని ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

32మంది విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాణ్యతలేని భోజనం తిని ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థినులు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని నేరడిగొండ పిహెచ్‌సికి తరలించి చికిత్స చేశారు. అందులో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స అనంతరం పాఠశాలకు తరలించారు.అనంతరం విద్యార్థినులు రాత్రి భోజనం చేశారు. మరోసారి 25 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని నేరడిగొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించారు. సోమవారం మరో ఏడుగురు అస్వస్థతకు గురి కాగా.. వారిని సైతం రిమ్స్‌కు పంపించారు. సమాచారం అందుకున్న డిఇఒ ప్రణీత పాఠశాలను సందర్శించారు. వంటగది, సామగ్రి, భోజనం వండుతున్న తీరు గురించి ఆరా తీశారు. భోజనం తయారు చేసే కార్మికులందరినీ తొలగిస్తున్నట్లు ప్రకటించారు.ఎస్వోను కూడా తొలగించాలని విద్యార్థినులు పట్టుబట్టడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు.

సర్కారు బడులను దత్తత తీసుకోండి

ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి సబిత విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సరం-2023 సందర్భంగా తనను కలవటానికి వచ్చే వారు ఎవరూ బొకేలు, శాలువలను తీసుకురావొద్దని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని ఆయా పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ చిన్న సహాయం పేద విద్యార్థుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.నోట్ పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, పెన్సిళ్లు, అంగన్‌వాడీ పిల్లలకు మ్యాట్లు, చిన్న వాటర్ బాటిళ్లు, ఇతరత్రా వాటిని అందించాలని సూచించారు. రానున్న నూతన సంవత్సరం సందర్భంగా అందరూ ఒక కొత్త నిర్ణయం తీసుకుని అమలు చేయాలని కోరారు.

సినీ జీవితానికి అద్దం పట్టిన పాకుడు రాళ్లు

ప్రజాశక్తి- కల్చరల్

ప్రముఖ కథకుడు రావూరి భరద్వాజ రచించిన పాకుడు రాళ్లు నవలను నస్రీన్ ఇషాక్ నాటకీకరించి ఆయన దర్శకత్వంలోనే నిభా థియేటర్ ఎన్ సెంబుల్ వారిచే రవీంద్రభారతి ప్రధాన వేదిక పై ప్రదర్శించారు. అందంగా ఆకర్షణగా కనిపించే వెండి తెర నటీమణులు జీవితాలలో చికిటి కోణాలను భరద్వాజ తన నవలలోఅద్భుతం గా అవిస్కరిస్తే యధాతధంగా నాటకాన్ని రూపొందించి నటులు రక్తి కట్టించారు. నెల నెలా టికెట్ పై నాటకం అనే నినాదాన్ని ఉద్యమంలా కొనసాగిస్తున్న రసరంజని నిర్వహణలో ఈ నాటకం ప్రదర్శితమైంది.

రూ. 50 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో భారీ ఎత్తున మాదక పదార్థాలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. అంతేగాక, మాదక పదార్థాల తయారీ, రవాణాకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులను హైదరాబాద్‌లో అరెస్టు చేసిన అధికారులు.. మరో స్మగ్లర్‌ను యుపి రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో అరెస్టు చేశారు. డిఆర్ఐ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అత్యంత రహస్యంగా లేబోరేటరీలు ఏర్పాటు చేసి మాదక పదార్థాల తయారీకి ఒక ముఠా పాల్పడుతున్నట్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో గత 21వ తేదీ నుంచి హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టిన డిఆర్ఐ అధికారులకు రెండు రహస్య లేబోరేటరీల ఆచూకీ లభించింది. దాంతో వాటిపై దాడి చేసిన అధికారులు భారీ మొత్తంలో మెతడిన్ మాదక పదార్థాలను స్వాధీనపర్చుకున్నారు. అంతేగాక, మాదకపదార్థాల తయారీ, రవాణాకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. మరోవ్యక్తి అక్కడి నుండి పారిపోయి నేపాల్‌కు వెళ్లే ప్రయత్నంలో ఉండగా.. యుపిలోని గోరఖ్‌పూర్ ప్రాంతంలో డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. ఆ స్మగ్లర్ నుంచి రూ. 60 లక్షల నగదును స్వాధీనపర్చుకరన్నారు. హైదరాబాద్‌లో పట్టుబడ్డ మాదక పదార్థాల విలువ రూ. 50 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు అంచనా వేశారు.

నందకుమార్‌ను విచారించిన ఇడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంచలనం రేపిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుడైన నందకుమార్‌ను చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో సోమవారం ఇడి అధికారులు విచారించారు. దాదాపు ఐదు గంటల పాటు జైలులోని ప్రత్యేక గదిలో నందకుమార్‌ను అధికారులు ప్రశ్నించారు. కోర్టు రెండ్రోజుల పాటు ఇచ్చిన గడువును ఆసరాగా చేసుకొని మొదటి రోజు నందకుమార్‌ను పలు ప్రశ్నలు వేసి సమాచారం రాబట్టడానికి ప్రయత్నించారు. ముఖ్యంగా, ఎమ్మెల్యేల కొనుగోలులో ఎలాంటి ప్రయత్నాలు జరిగాయి? అందుకు ఏ మేరకు డబ్బులను ఆశ చూపారు? ఇందులో కీలకపాత్ర వహించిందెవరు? మొదలైన ప్రశ్నలను ఈడీ అధికారులు నందకుమార్‌కు వేసినట్టు తెలుస్తున్నది. అంతేగాక, బిఆర్‌ఎస్ తాండూ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో తనకున్న సంబంధాలు ఎలాంటివి? వారి మధ్య ఉన్న లావాదేవీలు ఏమిటి? ఎన్నేండ్లుగా వారి పరిచయం ఉన్నది? అనే కోణంలో కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. దాదాపుగా అన్ని ప్రశ్నలకు నందకుమార్ నుండి సమాధానం రాబట్టినట్టు సమాచారం. కాగా, మంగళవారం రెండో రోజు కూడా ప్రశ్నించడానికి వస్తామని చెప్పి సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో తమ విచారణను ఈడీ అధికారులు ముగించినట్టు తెలిసింది. ఒక ఎఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలో ఈడీ అధికారులు నందకుమార్‌ను ప్రశ్నించారు.

సమాఖ్య వ్యవస్థపై దాడి దేశ సమైక్యతకు ముప్పు

- 2011 జనాభా లెక్కలతో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం కుట్ర
- గవర్నర్లకు ఎలాంటి అధికారాలు, బాధ్యతల్లేవు
- రాజ్యాంగంపై బహుముఖ దాడిని తిప్పికొట్టాలి : డా. కె నాగేశ్వర్
- మోడీ సర్కారు ఫాసిస్టు పాలనను అంతమొందించాలి : సురవరం
- ఘనంగా సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాఖ్య వ్యవస్థపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్ విమర్శించారు. దేశ సమైక్యతకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై కేంద్రం బహుముఖ దాడి చేస్తోందని అన్నారు. కమ్యూనిస్టులు ముందుండి పోరాడటం ద్వారా కేంద్రం అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు హిమాయత్‌నగర్‌లో ఉన్న సిపిఐ నగర కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణ పతాకాన్ని ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో 'రాజ్యాంగ రక్షణ-ఫెడరలిజం పరిరక్షణ'అనే అంశంపై నాగేశ్వర్ మాట్లాడుతూ పీడిత ప్రజలున్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మికులు, ఉద్యోగులు వాటిని అమలు చేసే పార్టీలకే ఓటేస్తున్నారని చెప్పారు. హక్కుల కోసం జరిగే పోరాటాలతోపాటు సైద్ధాంతిక భావజాలంలోనూ మార్పు రావాలని సూచించారు. రాజ్యాంగంపై బిజెపి సైద్ధాంతిక దాడి చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర హోంమంత్రిగా రాజ్‌నాథ్‌సింగ్ ఉన్నపుడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పీఠికలో లౌకిక అనే పదం లేదనీ, 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పదాన్ని చేర్చారంటూ చెప్పారని వివరించారు. లౌకిక అనే పదం అవసరం లేదన్న అభిప్రాయాన్ని సంఘ్‌పరివార్ శక్తులు కోట్ల మందిలోకి తీసుకెళ్లాయని అన్నారు. అయితే రాజ్యాంగం లౌకిక స్వభావాన్ని కలిగి ఉందంటూ సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని గుర్తు చేశారు. పర్యావరణాన్ని బోధించాలంటూ చెప్తారు కానీ రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలంటూ ఎవరూ చెప్పడం లేదన్నారు. అన్ని కోర్సుల్లోనూ రాజ్యాంగాన్ని నేర్పించాలని కోరారు.

మోడీ, షా తెలుగులో మాట్లాడాలి

భారతీయులంతా హిందీ నేర్చుకోవాలంటూ కేంద్ర మంత్రి అమిత్‌షా చెప్తున్నారని నాగేశ్వర్ గుర్తు చేశారు. అందరికీ హిందీ భాష ఆత్మవంటిదంటున్నారనీ, అలాంటపుడు తెలుగు ప్రేతాత్మ అవుతుందా? అని ప్రశ్నించారు. రాజ్యానికి మతమే లేదంటూ రాజ్యాంగం చెప్తుంటే హిందూరాజ్యం తేవాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. దేశంలో ఒకే భాష, ఒకే మతం ఉండాలంటున్నారని చెప్పారు. అది తెలుగు భాష ఎందుకు కాకూడదని అన్నారు. మోడీ, అమిత్‌షా తెలుగులో మాట్లాడాలని డిమాండ్ చేశారు. అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, మతాలు, భావాల సమామారమే భారతీయత అని వివరించారు. హిందువులందరికీ ఒకే దేవుడు ఉండాలంటూ చెప్తారా?అని బీజేపీ నాయకులకు నాగేశ్వర్ సవాల్ విసిరారు. దేశంలో 33 కోట్ల మంది దేవుళ్లున్నారనీ, ఎవరి ఆరాధన వారిదనీ, ఎవరి సంస్కృతి, సంప్రదాయం వారికుంటుందని అన్నారు. సమాఖ్యవ్యవస్థతోపాటు లౌకికత్వంపై నిర్దిష్టమైన దాడి జరుగుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనే పదాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గవర్నమెంట్ అనే పదాన్నే వాడాలని కోరారు. రాష్ట్రాల జాబితాలో ఉన్న వ్యవసాయం, సహకారరంగం, ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్, విద్యారంగంపైనా కేంద్రం చట్టాలు చేసిందన్నారు. రాజ్యాంగంలో గవర్నర్‌కు అధికారాలు, బాధ్యతలు ఏమీలేవని చెప్పారు. మంత్రిమండలి సలహా మేరకే పనిచేయాలని సూచించారు. కానీ రాష్ట్ర గవర్నర్ రాజ్‌భవన్‌ను రాజకీయ పార్టీ కార్యాలయంగా మార్చారని అన్నారు. ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలు ఎన్నుకున్న సిఎంను విమర్శిస్తారని చెప్పారు. కేరళ గవర్నర్ ఓ అడుగు ముందుకేసి ఓ మంత్రి విశ్వాసం లేనందున తొలగించాలంటూ సిఎంకు లేఖ రాశారని గుర్తు చేశారు. ఆ మంత్రిపై తనకు విశ్వాసముందంటూ కేరళ సిఎం సమాధానమిచ్చారని అన్నారు. రాష్ట్రాల హక్కులకు భంగం కలిగేలా జీఎస్టీని కేంద్రం తెచ్చిందని విమర్శించారు. రాష్ట్రాలకు 41 శాతం నిధులిస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నదని అన్నారు. కేవలం 21 శాతం నిధులే వస్తున్నాయని చెప్పారు. 1971 జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన జరగాలన్నారు. కానీ కేంద్రం కుట్ర చేసి 2011 జనాభా లెక్కల ఆధారంగా చేయాలని భావిస్తున్నదని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని చెప్పారు. యుపి, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తరాది రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. రాజ్యాంగాన్ని, సమాఖ్య స్ఫూర్తిని రక్షించుకోవాలని కోరారు.

నిరంతరం ప్రజాపోరాటాలను నిర్మించాలి : సురవరం

దేశంలో మోడీ సర్కారు ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోందని సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ఐక్యంగా పోరాడి ఆ పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు, వామపక్ష శక్తుల పునరేకీకరణ జరగాలన్నారు. దేశంలో ఒక శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. విశాల ప్రాతిపదికన వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు ఐక్యం కావాలని చెప్పారు. ఈ విశాలమైన ఐక్యతకు సిపిఐ, సిపిఎం కలయిక దోహదపడుతుందన్నారు. ప్రజాసమస్యలపై కొత్త పోరాటాలకు రూపకల్పన చేయాలనీ, ఆ దిశగా ప్రతిన బూనాలని ఆయన పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజాపోరాటాలను నిర్మించాలని సూచించారు. ప్రజల కోసం నిర్వహించే పోరాటానికి చారిత్రక బాధ్యత ఉన్నదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి మరణం లేదన్నారు. అది త్యాగం అనే సిద్ధాంతంతో పుట్టిన పార్టీ అని అన్నారు. నిరంతరం ప్రజా గొంతుకగా, నూతన తరహా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కమ్యూనిస్టుల పునరేకీరణ జరగాలంటూ పేదలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్పొరేట్ వ్యవస్థలో ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి పాత్ర పెరిగిపోయిందన్నారు. నీతి, నిజాయితీతో పోటీ చేస్తే ఎవరి బలమేంటో తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ బాలమల్లేశ్, ఈటి నర్సింహ, మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి జంగయ్య, మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అమర వీరుల ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తి, ఐఎస్ రాజు, సుదీర్ఘ కాలం సిపిఐ కార్యాలయ కార్యదర్శిగా పని చేసిన డిఎస్ రాంచందర్‌రావు, చెన్నయ్య, చెన్నమనేని వెంకటేశ్వర్‌రావును శాలువాతో సన్మానించారు.